సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం । 2 । సెప్టెంబర్ । 2025



ఫస్ట్ వస్తే అవస్థలే

ఫస్టు వస్తే చాలు పింఛన్ కోసం వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు అవస్థలు **పడుతున్నారు. నడవలేని స్థితిలో ఉన్నా సచివాలయానికి వెళ్లాల్సి వస్తోంది.** 8లో ▸



నారాయణ స్కూల్లో దారుణం

పాలకొల్లు నారాయణ స్కూల్లో ఓ చిన్నారి హార్పిక్ పౌడర్ తినేయడంతో ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. ఈ విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. 8లో ▸



శోకసంద్రంగా తీరం

వినాయక నిమజ్జనంలో జరిగిన అపశ్రుతి నరసాపురం మండలం **తూర్పుతాళ్లులోని ఆ నాలుగు కుటుంబాల్లో తీరని శోకం మిగిల్చింది.** 8లో ▸

న్యూస్‌రీల్

నిమజ్జనంలో ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరం

ముదునూరి ప్రసాదరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

నరసాపురం: నరసాపురం మండలం తూర్పు తాళ్ల గ్రామంలో గణేశ్ నిమజ్జనంలో నలుగురు ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు విచారం వ్యక్తం చేశారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ పండుగ సంబరంలో ప్రమాదం జరిగి ప్రానాలు కోల్పోవడంపై ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు.

కర్నూలు ఉల్లి వాడండి



గూడెం మార్కెట్‌లో ఉల్లిపాయలను పరిశీలిస్తున్న కలెక్టర్ చదలవాడ నాగరాణి

తాడేపల్లిగూడెం: జిల్లా వాసులు కర్నూలు ఉల్లి పాయలను వినియోగిస్తూ కర్నూలు రైతులను ఆదుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు. సోమవారం బ్రహ్మానందరెడ్డి మార్కెట్‌ను సందర్శించారు. ఉల్లి అమ్మకం, కొనుగోళ్లను పరిశీలించారు. హాస్టల్స్, ప్రైవేటు కళాశాలల వంటల్లో ఈ రకం ఉల్లిపాయలను వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆమె వెంట ఆర్డీఓ కౌసర్ భానో, మార్కెటింగ్ ఏడీ సునీల్‌కుమార్ తదితరులు ఉన్నారు. కర్నూలు ఉల్లిపాయలను రైతుల నుంచి ఇక్కడి గుత్త వ్యాపారులు కిలో రూ.12 కొనుగోలు చేయాలని సాయంత్రం పట్టణంలోని చాంబర్ ఆఫ్ కామర్సులో వ్యాపారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ కోరారు. కొంతకాలం మహారాష్ట్ర ఉల్లి దిగుమతులు తగ్గించుకుని, కర్నూలు ఉల్లి వినియోగం పెంచడానికి వ్యాపారులు దోహదపడాలన్నారు. కలెక్టర్ ప్రతిపాదనకు వ్యాపారులు అంగీకరించారు. మెగా మార్టుల ద్వారా కర్నూలు ఉల్లి విక్రయించే ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. అనంతరం పట్టణంలోని సవిత్రుపేటలో పింఛన్ల పంపిణీని కలెక్టర్ పరిశీలించారు. స్థానికంగా దాతల సహకారంతో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు.

త్వరితగతిన స్పందించాలి



ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

భీమవరం: ప్రజా సమస్యలపై త్వరితగతిన స్పందించి నిర్ణీత గడువులోగా చట్ట పరిధిలో శాశ్వత పరిష్కారం చూపాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో అర్జీలను తీసుకున్న అనంతరం సంబంధిత పోలీసు స్టేషన్ల అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యతనిస్తూ అర్జీలు పునరావృతం గాకుండా నిర్ణీత గడువులోగా శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు. 15 ఫిర్యాదులు అందాయని తెలిపారు.

ఇసుక మాఫియాపై ఫిర్యాదు



ఇసుక అక్రమ రవాణాపై బీవీ రాఘవులుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం


పెనుగొండ: పేదలకు ఉచితంగా అందించాల్సిన ఇసుకను ఆచంటలో టీడీపీ నాయకుడు గణపతినీడి రాంబాబు అక్రమంగా ర్యాంపుల ద్వారా తరలించి, వాటిని ప్రతి గ్రామంలో గుట్టలను నిల్వ చేసి అక్రమంగా తరలిస్తున్నారని, అధికారులకు ఫిర్యాదు చేసినా చూసీ చూడనట్లు వ్యవహిస్తున్నారని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులకు వైఎస్సార్‌సీపీ నాయకులు సుంకర సీతారామ్, కోట వెంకటేశ్వరరావు వినతి పత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ గణపతినీడి రాంబాబు నియోజకవర్గంలోని ఇసుక ర్యాంపుల ద్వారా అక్రమంగా ఇసుక తరలించి, అధిక రేటుకు అమ్ముతున్నారని తెలిపారు.

రాజన్నా.. నీ జ్ఞాపకాలు పదిలం

2009 సెప్టెంబరు 2..

పేదల ఆశాదీపం ఆరిపోయిన చీకటి రోజు.. కొండంత అండ కరిగిపోయిన రోజు..
నమస్తే అక్కయ్యా.. నమస్తే చెల్లెమ్మా.. నమస్తే.. నమస్తే. నమస్తే బాబు..
నమస్తే పాప.. నమస్తే.. నమస్తే.. నమస్తే అన్న ఆత్మీయ పిలుపు దూరమైన రోజు..
రాజన్న ఈ లోకాన్ని వీడి తిరిగిరాని లోకాలకు తరలిపోయిన రోజు..

పేద బతుకులకు భరోసాను కల్పించిన మహానేత దివికేగి అప్పుడే 16 ఏళ్లు గతించిపోయినా ఆ చిరునవ్వు ఇంకా కళ్ల ముందు కదలాడుతూనే ఉంది. ఆ ఆత్మీయ పిలుపు చెవుల్లో మార్మోగుతూనే ఉంది. నేడు వైఎస్ వర్ధంతి సందర్భంగా మంగళవారం జిల్లా అంతటా పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాల నిర్వహణకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు సన్నాహాలు చేస్తున్నారు.





హార్టీకల్చర్ యూనివర్శిటీ

సంక్షేమానికి చిరునామా వైఎస్సార్

కొత్త పింఛన్ రావాలంటే ఉన్న లబ్ధిదారుల్లో ఎవరు పోతారాని ఎదురుచూసే వారు కొందరైతే, సొంత గూడు కలగానే మిగిలిపోతుందనుకునే వారు మరికొందరు. జబ్బు చేస్తే వైద్యం చేయించుకోలేని, పిల్లల్ని పెద్ద చదువులు చదివించలేని పరిస్థితి. సాగు భారమై రైతులు బలవన్మరణాలకు పాల్పడుతున్న రోజులు. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి అధికారంలోకి రాకమునుపు పేదల దుస్థితి ఇది. 2004లో సీఎంగా బాధ్యతలు చేపట్టాక ఆయన అమలు చేసిన పథకాలు పేదలకు ఉన్నత విద్యనందించాయి. సొంతింటి కలను సాకారం చేశాయి. లక్షల ఖరీదైన కార్పొరేట్ వైద్యాన్ని అందించాయి. రైతులకు వ్యవసాయాన్ని పండుగ చేశాయి. అర్హులందరికీ సంక్షేమ లబ్ధిని చేరువచేశాయి. 108, 104, పింఛన్లు, పావలా వడ్డీ, రుణమాఫీ ఇలా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు పేదవర్గాల వారి అభివృద్ధికి బాటలు వేశాయి.

- వ్యవసాయాన్ని పండగ చేసిన వైఎస్సార్
- ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పేద విద్యార్థులకు వెలుగులు
- ఆరోగ్యశ్రీ, 108, 104లతో వైద్య భరోసా
- జిల్లాతో ఆత్మీయ అనుబంధం
- నేడు వైఎస్ వర్ధంతి

సాక్షి, భీమవరం: పశ్చిమగోదావరి జిల్లాతో దివంగత వైఎస్సార్‌కు ప్రత్యేకమైన అనుబంధం ఉంది. రాజకీయ ప్రస్థానంలో పలుమార్లు జిల్లాకు విచ్చేసిన ఆయన జిల్లా వాసులతో మమేకమయ్యేవారు. నమస్తే అక్కయ్యా.. నమస్తే చెల్లమ్మా.. నమస్తే అన్నయ్యా.. నమస్తే తమ్ముడూ అంటూ అందరితో ఆప్యాయంగా మాట్లాడేవారు. చోటామోటా నాయకుల పేర్లను సైతం గుర్తుపెట్టుకుని పలకరిస్తూ యోగక్షేమాలను అడిగి తెలుసుకునేవారు.

గోదావరి చెంత ప్రగతి పరవళ్లు

- ఆరోగ్యశ్రీ ద్వారా జిల్లాలోని దాదాపు 32 వేల మందికి రూ.150 కోట్ల విలువైన వైద్యసేవలు ఉచితంగా అందించారు. టీడీపీ హయాంలో రూ.75 ఉన్న పింఛన్ సాయాన్ని రూ.200కు పెంచి అర్హులందరికీ కొత్త పింఛన్ల మంజూరు చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా పేద విద్యార్థులకు మెడిసిన్, ఇంజినీరింగ్ తదితర ఉన్నత విద్యను అందించారు. పావలా వడ్డీ రుణాలు, తదితర పథకాల ద్వారా ప్రజలకు ఎంతో మేలు చేశారు.
- దక్షిణ భారత దేశంలోనే మొదటిగా 2007లో హార్టీకల్చర్ యూనివర్శిటీని తాడేపల్లిగూడెం రూరల్ వెంకట్రామన్నగూడెంలోని 220 ఎకరాల్లో ఏర్పాటుచేశారు. రూ.40 కోట్లు ప్రాథమిక వ్యయంతో అంచెలంచెలుగా అభివృద్ధి చేయగా నేడు దేశ వ్యాప్తంగా ఉద్యాన రైతులకు సేవలు అందిస్తోంది.
- పేదల సొంతింటి కలను సాకారం చేస్తూ ఇందిరమ్మ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలుచేశారు. అర్బన్ ఏరియాల్లో రూ.30,000 రుణ సాయాన్ని రూ. 55,000కు, రూరల్‌లో రూ.22,500ల నుంచి రూ.45,000కు, అలాగే ఎస్సీలకు అర్బన్ ఏరియాల్లో రూ.75,000, రూరల్‌లో 65,000కు పెంచారు. జిల్లా వ్యాప్తంగా 350 ఎకరాలకు పైగా భూమిని సేకరించి, మెరక పనులుచేసి వేలాది మంది పేదలకు పంపిణీ చేసి ఇళ్లను నిర్మించారు. స్థలం ఉంటే సాయాన్ని అందించి సొంత గూడును సమకూర్చారు.
- డెల్టా ఆధునీకీకరణలో భాగంగా సుమారు రూ. 140 కోట్లతో కాలువలను అభివృద్ధి చేయడంతో పాటు రుణమాఫీ, పావలా వడ్డీ రుణాలు, ఉచిత విద్యుత్, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు తదితర కార్యక్రమాల ద్వారా సాగును పండగ చేశారు.
- భీమవరంలో సమ్మర్ స్టోరేజి ట్యాంకు-2, యనమదుర్రు డ్రెయిన్‌పై ఐదు వంతెనలు, నరసాపురం రూరల్ పేరుపాలెం బీచ్‌కు అనుసంధానంగా రోడ్లు, బీచ్ అభివృద్ధి, పాలకొల్లు మండలం శివుదేవని చిక్కాలలో సాగునీటికి ఎత్తిపోతల పథకం, తాడేపల్లిగూడెంలో వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల, ఆంధ్రా యూనివర్శిటీ క్యాంపస్, రూ.34 కోట్లతో యాగర్లపల్లి వద్ద రెండవ ఫ్లైఓవర్, ఎరక్రాలువపై అప్పారావుపేట, వీరంపాలెం, మాధవరం-కంసాలిపాలెం వద్ద మూడు వంతెనలు, మోడ్రన్ లైబ్రరీ తదితర అభివృద్ధి పనులు వైఎస్ హయాంలో జరిగినవే.

చెప్పుకోదగ్గ పథకం ఏదీ లేదు

మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: రాజకీయాల్లో 40 ఏళ్ళ చరిత్ర ఉందని ఊకదంపుడు ప్రసంగాలిచ్చే చంద్రబాబు తన పాలనలో బెల్టు షాపు పథకం తప్ప చెప్పుకోవడానికి ఏ ఒక్క పథకం మిగలలేదని మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఎద్దేవా చేశారు. సోమవారం రాత్రి పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం కొమ్ముగూడెంలో «బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ» కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ రైతు శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని తమ ప్రభుత్వంలో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేశామన్నారు. ప్రకృతి విపత్తుల సమయంలో రైతులను ఆదుకునేందుకు దాదాపు వెయ్యి కోట్లతో ప్రభుత్వమే పంటల బీమా చేయించిందని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వంలో ఆ భారమంతా ప్రజలపై వేసిందన్నారు.



'బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ' కార్యక్రమంలో మాట్లాడుతున్న కొట్టు సత్యనారాయణ

సూపర్ సిక్స్ పథకాల పేరిట మోసం చేయడం తప్ప చంద్రబాబు ప్రజలకు న్యాయం చేసిన దాఖలాలు లేవని దుయ్యబట్టారు. దీపం పథకానికి బడ్జెట్‌లో రూ.740 కోట్లు పెట్టి ఎగ్గొట్టారన్నారు. ఆయన వెంట జిల్లా అధికార ప్రతినిధి ముప్పిడి సంపత్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జడ్డు హరిబాబు ఉన్నారు.

భవన నిర్మాణ కార్మికుల పోస్టుకార్డు ఉద్యమం

తాడేపల్లిగూడెం (టీఓసీ): భవన నిర్మాణ కార్మిక వెల్ఫేర్ బోర్డులో పెండింగ్‌లో ఉన్న క్లెయింలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ జరుగుతున్న పోస్టు కార్డు ఉద్యమంలో పట్టణ పెయింటర్లు పాల్గొన్నారు. సోమవారం యాగర్లపల్లి వద్ద, గాయత్రి దేవి గుడి కల్యాణ మండపం వద్ద పెయింటర్ల నెలవారీ సమావేశాలు జరిగాయి. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ మాట్లాడుతూ వెల్ఫేర్ బోర్డు కోసం పోరాడాల్సిన బాధ్యత కార్మికులపై ఉందన్నారు. పెండింగ్‌లో ఉన్న 46 వేల క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించాలని, వెల్ఫేర్ బోర్డులో నూతన సభ్యులను నమోదు చేసి కార్డులు ఇవ్వాలని కోరారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి పోస్టు కార్డులు రాసి పోస్టు చేశామని వివరించారు. నాయకులు నానిపల్లి రాంబాబు, బెవర నారాయణ, బసవ సామేలు, కర్రి గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ఉండిలో..

ఉండి: సంక్షేమ బోర్డును వెంటనే అమలులోకి తేవాలంటూ మండల భవన నిర్మాణ కార్మికులు డిమాండ్ చేశారు. ఉండి పార్క్‌లో నిర్వహించిన మండల భవన నిర్మాణ కార్మికులు సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి తమ గళం వినిపించేలా పోస్టుకార్డు ఉద్యమాన్ని పారంభించారు. సంఘ అధ్యక్షుడు శేషాద్రి శ్రీను మాట్లాడుతూ బోర్డును పునఃప్రారంభిస్తామని చేసిన వాగ్దానాన్ని వెంటనే నెరవేర్చాలన్నారు. పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించి కార్మికులకు చేయూత అందించాలన్నారు. కార్యక్రమంలో గుండుగొలను ఆదాము, ఆడపా గణేష్, ఏడిద సతీష్ తదితరులు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెంలో పోస్టుకార్డుల ఉద్యమంలో భవన నిర్మాణ కార్మికులు

అగ్గిపుల్లలపై వైఎస్సార్ చిత్రం



దివంగత నేత వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఏలూరుకు చెందిన సూక్ష్మ కళాకారుడు మేతర సురేష్ బాబు అగ్గిపుల్లపై ఆయన చిత్రాన్ని రూపొందించి నివాళులర్పించారు. వైఎస్సార్ పక్కనే ఆయన తనయుడు వైఎస్ జగన్ చిత్రాన్ని కూడా రూపొందించి అభిమానాన్ని చాటుకున్నారు.

– ఏలూరు (టూటౌన్)

వైద్య విద్యను ప్రైవేట్‌పరం చేస్తే ఉద్యమమే

భీమవరం: వైద్య విద్యను ప్రైవేట్‌పరం చేయడం దుర్మార్గమని ఆలిండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి విమర్శించారు. సోమవారం భీమవరం పట్టణంలోని మూర్తిరాజు ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో 17 వైద్య కళాశాలలను నెలకొల్పడానికి శ్రీకారం చుట్టగా అందులో ఏడు కళాశాలలు ఇప్పటికే ప్రారంభమయ్యాయని ప్రస్తుతం కూటమి ప్రభుత్వం మిగిలిన 10 వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు సన్నద్ధం కావడం చాలా దారుణమన్నారు. కూటమి ప్రభుత్వ విధానం వల్ల రాష్ట్రంలో ప్రతిభ గల పేద విద్యార్థులకు ఎంబీబీఎస్ కలగానే మిగిలిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అనేక రాష్ట్రాల్లో కొత్త మెడికల్ కళాశాలలకు పీపీపీ విధానాన్ని అమలు చేస్తూ ఆయా రాష్ట్రాల్లో కేవలం భూములను మాత్రమే లీజుకిచ్చి ప్రైవేటు ద్వారా కళాశాలలు నెలకొల్పేలా చర్యలు తీసుకుంటే ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం 80 శాతం నిర్మించిన వైద్య కళాశాలలను, ఎంబీబీఎస్ తరగతులను ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్న కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు ధారదత్తం చేసేందుకు ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని విమర్శించారు. వైద్య కళాశాలలను ప్రైవేట్ పరం చేస్తే తీవ్రస్థాయిలో విద్యార్థి ఉద్యమం ప్రారంభిస్తామని హెచ్చరించారు.

అర్జీల పరిష్కారంలో చొరవ చూపాలి

భీమవరం(ప్రకాశం చౌక్): పీజీఆర్ అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని కలెక్టర్ సి.నాగరాణి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ కార్యక్రమంలో పాల్గొని జిల్లాలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు సమర్పించిన అర్జీల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి నాణ్యమైన పరిష్కారాన్ని చూపాలన్నారు. శాఖల వారీగా వచ్చిన అర్జీలను పరిశీలించి తక్షణమే పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. అర్జీల పరిష్కారంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, నిర్లక్ష్యానికి తావు లేకుండా సమష్టిగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, డీఆర్‌వో బి.శివన్నారాయణ రెడ్డి, డ్వామా పీడీ డాక్టర్ కెసీసీహెచ్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ సి.నాగరాణి

స్వల్పంగా తగ్గిన గోదావరి

పోలవరం రూరల్: గోదావరి వరద స్వల్పంగా తగ్గింది. ఎగువ ప్రాంతాల నుంచి నదిలోకి చేరే నీరు తగ్గుతుండటంతో వరద ప్రవాహం తగ్గుతోంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద 33 మీటర్లకు వరద నీటిమట్టం చేరుకుంది. స్పిల్‌వే 48 గేట్ల నుంచి 10.73 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు చేరుతోంది. భద్రాచలం వద్ద 43.40 అడుగులకు నీటి మట్టం చేరుకుంది.

ప్రభుత్వం ఆదుకోవాలి

ఏలూరు (టూటౌన్): ఏలూరు టాటా మ్యాజిక్ ఓనర్స్, డ్రైవర్స్ ఐక్య కార్యాచరణ వేదిక ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఆటో, టాటా మ్యాజిక్, క్యాబ్ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ధర్నాని ఉద్దేశించి ఐఎఫ్‌టీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే పోలారి, ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు మాట్లాడుతూ ఉచిత బస్సు ప్రయాణం వల్ల టాటా మ్యాజిక్ సర్వీస్ ఆదాయం తీవ్రంగా దెబ్బతిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆటో, టాటా మ్యాజిక్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని. నెలకు రూ.3000 పెన్షన్ పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

సోషలిజమే ప్రత్యామ్నాయం

సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు రాఘవులు

భీమవరం: అనేక దేశాల్లో పెట్టుబడిదారీ వ్యవస్థ విఫలమైందని దేశానికి సోషలిజమే ప్రత్యామ్నాయమని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు స్పష్టంచేశారు. సోమవారం భీమవరంలో సోషలిజం–విశిష్టత అనే అంశంపై జిల్లాస్థాయి సెమినార్‌లో ఆయన మాట్లాడారు. సోషలిజానికి అనేక దేశాల్లో ఆదరణ కూడాపెరుగుతుందన్నారు. ప్రతి మనిషికి సమాన హక్కులు ఇచ్చేది, తిండి, ఇల్లు, విద్య, వైద్యం హక్కుగా మార్చి, సమాన వేతనం, అన్ని రకాల అసమానతలను, అమానుషమైన కులవ్యవస్థ వంటి వాటిని రద్దు చేసి సమానత్వాన్ని చూపించేదే సోషలిజమన్నారు. దేశంలో కులవ్యవస్థ శ్రమదోపిడికి మరింత దోహదం చేస్తుందని రాఘవులు ఆందోళన వ్యక్తం చేశారు. ఏ దేశంలో స్త్రీ, పురుష సమానత్వం ఉంటుందో అక్కడ ఉత్పత్తితో పాటు అభివృద్ధి కూడా పెరుగుతుందన్నారు. నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలను ఇబ్బందులు పెడుతున్నాయని అమెరికా సుంకాల ప్రభావం పశ్చిమ గోదావరి జిల్లాపై ఎక్కువగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై ఉద్యమ, పోరాటాలు మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. సెమినార్‌కు సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎస్వీ గోపాలన్ అధ్యక్షత వహించగా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరామ్, కమిటీ సభ్యుడు మంతెన సీతారామ్ తదితరులు పాల్గొన్నారు.



భీమవరంలో మాట్లాడుతున్న సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు రాఘవులు

క్లుప్తంగా

మద్దిలో పవిత్రోత్సవాలు ప్రారంభం



పవిత్రోత్సవాల్లో భాగంగా మద్దిక్షేత్రంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : గుర్వాయిగూడెం మద్ది క్షేత్రంలో సోమవారం పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. నాలుగు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాల్లో తొలి రోజు ఆంజనేయ స్వామి వారికి విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనము, మృత్సంగ్రహణ, అంకురార్పణ, దీక్షా ధారణ, యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ఠ, అకల్మష హోమాలు, ఏతత్ ప్రధాన హోమాలు నిర్వహించినట్లు ఆలయ ఈవో ఆర్‌వీ చందన తెలిపారు. అలాగే రెండవ రోజు మంగళవారం నిత్యకైంకర్యాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఈవో చెప్పారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి



చలో విజయవాడ పోస్టర్‌ను ఆవిష్కరించిన దృశ్యం

చింతలపూడి : సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఏపీ సీపీఎస్ ఈఏ రాష్ట్ర కౌన్సిలర్ కంచర్ల బుచ్చిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో సోమవారం చలో విజయవాడ కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బుచ్చిబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకొని పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. చలో విజయవాడకు ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు సంపూర్ణ మద్దతు తెలిపాయి.కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు పాల్గొన్నారు.

3న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరు రాక

ఏలూరు (టూటౌన్): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఈ నెల మూడో తేదీన ఏలూరు రానున్నారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ విక్రమ్ కిషోర్ సోమవారం విలేకరులకు తెలిపారు. బుధవారం ఉదయం 7.30 నుంచి సాయంత్రం వరకు ఏలూరులో జరిగే వివిధ కార్యక్రమాల్లో పాల్గొని, అనంతరం నాలుగు గంటలకు మీడియాతో ముఖాముఖి నిర్వహిస్తారని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొయ్యలగూడెం: ద్విచక్ర వాహనంతో చెట్టును ఢీ కొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కన్నాపురం గ్రామ శివారున సోమవారం చోటు చేసుకుంది. తూర్పుగోదావరి జిల్లా గౌరీపట్నం గ్రామానికి చెందిన అయినపుడి సత్యనారాయణ (60) ద్విచక్రవాహనంపై బుట్టాయిగూడెం మండలం కంద్రికగూడెంలో బంధువు రెడ్డి వెంకట్రావు ఇంటికి వెళ్లి తిరిగి వస్తూ కన్నాపురం శివారు వచ్చేసరికి చెట్టును ఢీకొన్నారు. దీంతో తలకు బలమైన గాయమైంది. స్థానికులు కొయ్యలగూడెం ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే సత్యనారాయణ మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.



పింఛన్ తెచ్చుకోవాలిగా : ఏలూరులో సచివాలయానికి పింఛన్ తీసుకునేందుకు రిక్షాపై వెళుతున్న వృద్ధులు



సమాధానం చెప్పేవారు లేరు : చోడిదిబ్బ సచివాలయం సిబ్బంది లేక ఖాళీగా ఉన్న దృశ్యం



ఇంటికేగా పింఛన్ : ఏలూరు కొత్తపేట సచివాలయంలో పింఛన్‌ల అందజేత

ఫస్ట్ వస్తే అవస్థలే

ఫస్ట్ తారీఖు వస్తే చాలు పింఛన్ డబ్బుల కోసం వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు నానా అవస్థలు పడుతున్నారు. పింఛన్ ఇవ్వడానికి సిబ్బంది ఎప్పుడొస్తారో అని ఎదురుచూసి.. రాకపోయే సరికి నడవలేని స్థితిలో ఉన్నా అవస్థ పడి మరీ సచివాలయానికి వెళ్లాల్సి వస్తోంది. తీరా అక్కడికి వెళ్తే సమాచారం చెప్పే వారు లేకపోవడంతో పడిగాపులు పడుతున్నారు. దీనికి తోడు సచివాలయ సిబ్బందిని కూటమి ప్రభుత్వం ఇష్టానుసారం బదిలీలు చేయడం, పింఛన్‌దారుల అడ్రస్‌లు తెలియక వెతికే ఉద్యోగులు కొందరైతే, వాళ్లే వస్తారులే అని ధీమాగా కూర్చొనే ఉద్యోగులు కొందరు మరో వైపు ఉన్నారు. ఇంటింటికీ వచ్చి తలుపు కొట్టి పింఛన్ ఇచ్చే ప్రభుత్వాన్ని కాదని, ఇలా గుమ్మంలో ఎదురుచూపులు, సచివాలయాల చుట్టూ తిరిగే అవస్థలు కోరి తెచ్చుకున్నామని లబ్ధిదారులు ఘొల్లుమంటున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఏలూరు



సచివాలయానికి వెళ్లాల్సిందే..



సచివాలయం గుమ్మంలో పింఛన్ కోసం పడిగాపులు



పింఛన్ ఇవ్వాలి : సిబ్బంది కోసం వృద్ధుడి ఎదురుచూపులు



వీధిలోనే ఎదురుచూపులు : పింఛన్ లబ్ధిదారుల పడిగాపులు



నడవలేని స్థితిలో సచివాలయానికి వస్తున్న వృద్ధురాలు

అయినవాళ్లే ఆదరించకపోతే..!

తణుకు అర్బన్: నడవలేని స్థితిలో ఉండడంతో భారమవుతాడనుకున్నారో ఏమో కానీ తండ్రి, తోడబుట్టిన సోదరులు ఇంట్లోకి రానివ్వడం లేదు. దీంతో తనను ఇంట్లోకి రానివ్వండి అంటూ ఆ యువకుడు వేడుకుంటూ రోదిస్తున్న తీరు ఆ ప్రాంతవాసులను కలచివేస్తోంది. మానవత్వాన్ని మంటకలిపే ఈ ఘటన తణుకు మండలం వేల్పూరు గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... గ్రామంలోని సాలిపేటకు చెందిన తాడిశెట్టి నాగ త్రినాథ్ గత ఏడేళ్లుగా సింగపూర్‌లోని షిప్‌యార్డులో రెస్క్యూ టీంలో ఉద్యోగిగా ఉపాధి పొంది కుటుంబంలో ఏర్పడ్డ సమస్యలతో గతేడాది జూలైలో ఇండియాకు వచ్చారు. అయితే ఇటీవల రోడ్డు ప్రమాదంలో నడుము భాగంలో తగిలిన గాయానికి కాలు కదపలేని స్థితిలో విశాఖపట్నం, విజయవాడ ఆస్పత్రుల్లో చికిత్స పొందారు. చేతిలో ఉన్న డబ్బు అయిపోగా సోమవారం ఆస్పత్రి నుంచి ఇంటికి రాగా ఇంట్లోకి రానీయకుండా తండ్రి, అన్నదమ్ములు ఇంటి తలుపులు మూసేశారు. దీంతో దిక్కుతోచక ఇంటి ముందు రోదిస్తూ ఉండిపోయారు. గతంలోనే తల్లి చనిపోగా తండ్రి తాడిశెట్టి నాగేశ్వరరావు, అన్న, తమ్ముడు ఇంట్లోకి రానీయడంలేదని చెబుతున్నారు. సింగపూర్‌లో ఉన్నంత కాలం సంపాదించిన సొమ్ము అంతా ఇంటికే పంపించానని, కానీ నేడు ఆరోగ్యం బాగోలేని సమయంలో సొంతవాళ్లే పట్టించుకోవడం లేదని త్రినాథ్ వాపోతున్నారు. నడవలేని స్థితిలో యూరిన్ బ్యాగ్‌తో వీల్‌చైర్‌లో ఉన్న త్రినాథ్ పడుతున్న ఆందోళన, ఆవేదన వర్ణనాతీతంగా మారింది. తన సమస్యను పరిష్కరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్‌లతోపాటు తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణలను సోషల్ మీడియా వేదికగా వేడుకుంటున్నారు.



వేల్పూరులో ఇంటి బయట వేచిఉన్న నాగ త్రినాథ్

శోకసంద్రంగా తీరం

తూర్పుతాళ్లు ఈవనవారి మెరకలో విషాదఛాయలు

నరసాపురం రూరల్: వినాయక నిమజ్జనంలో జరిగిన అపశ్రుతితో ఆ నాలుగు కుటుంబాల్లో తీరని శోకం మిగిల్చింది. భక్తిశ్రద్ధలతో గణపయ్యను మొక్కే ఆ కుటుంబాల్లో వినాయక చవితి పండుగ చీకటి రోజులను విడిచింది. తూర్పుతాళ్లు గ్రామపరిధిలోని ఈవనవారి మెరక రామలయం వద్ద ఆదివారం జరిగిన నిమజ్జన ఊరేగింపు ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందిన నలుగురూ నాలుగు కుటుంబాలకు చెందిన వారు. చనిపోయిన నలుగురిలో ముగ్గురు ఆయా కుటుంబాలకు ముఖ్యజీవనాధారం. రెక్కాడితేగాని డొక్కాడని జీవితాలు వారివి. వారిని మృత్యువు కబళించేయడంతో ఆ కుటుంబాల పరిస్థితి అయోమయమైంది.

గుమ్మం ఎదుటే మృత్యువాత

ఈవన సూర్యనారాయణ (58) వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తుంటారు. ఆయనకు ముగ్గురు కుమారులు కాగా వారిలో ఇద్దరు పెయింటింగ్ పని చేస్తుంటారు. మూడో కుమారుడు ఉద్యోగం చేస్తున్నాడు. అతడికి వివాహం చేయాల్సి ఉంది. ఘటన జరిగే ముందే వ్యవసాయ పనులు ముగించుకుని స్నానం చేసి దేవుని ఊరేగింపులో పాల్గొనేందుకు వచ్చిన సూర్యనారాయణ ఇంటి ఎదుటే మృత్యువాత పడ్డాడు.

భారం మోసేవాడే దూరమైతే..

గురుజు మురళి (38)కి వివాహమై మూడేళ్లయింది. భార్య కనకమహాలక్ష్మితో పాటు వృద్ధులైన తల్లిదండ్రులు, వ్యవసాయ కూలీగా జీవనం సాగించే తమ్ముడు ఉన్నారు. ఆర్థిక పరిస్థితి మెరుగు పరుచుకునేందుకు ఇటీవలే బట్టల వ్యాపారం కూడా ప్రారంభించాడు. కుటుంబ భారాన్ని మోసే కొడుకు దూరం అవడంతో ఆ కుటుంబం రోదనలు మిన్నంటాయి.

జీవిత మాధుర్యాన్ని అనుభవించకుండానే..

తిరుమల నరసింహమూర్తి (35) పెయింటర్‌గా జీవనం సాగిస్తున్నాడు. అందరితో మంచిగా ఉంటూ ఆనందంగా ఉండే చురుకైన వ్యక్తి. ఇతనికి లేక లేక కలిగిన కవలలైన బాబు, పాపలతో ఇప్పుడిప్పుడే జీవిత మాధుర్యాన్ని చూస్తున్నాడు. ఇంతలోనే అతని మరణం కుటుంబంతో పాటు బంధుమిత్రులెవరూ జీర్ణించుకోలేకపోతున్నారు.

బాలుడిని కబళించిన మృత్యువు

జై బోలో గణేష్ మహారాజ్‌కీ అంటూ చిందులేసిన తొమ్మిదేళ్ల కడియం దినేష్‌నాయుడు నరసాపురం పట్టణంలోని ఓ ప్రైవేటు స్కూల్లో ఐదవ తరగతి చదువుతున్నాడు. వినాయక నిమజ్జన ఊరేగింపు చూసేందుకు వ్యాన్ డ్రైవర్‌గా జీవనం సాగించే నాన్న, అన్నయ్యలతో పాటే వెళ్లాడు. ఒక్కసారిగా ట్రాక్టర్ మృత్యురూపంలో దూసుకు రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కొడుకు లేడన్న విషయంతో ఆ తల్లిదండ్రుల రోదనలను ఆపడం ఎవరితరం కావడంలేదు. సోమవారం నరసాపురం ప్రభుత్వాసుపత్రినుంచి మృతదేహాలకు పంచనామా ముగించుకుని గ్రామానికి తీసుకురావడంతో కుటుంబసభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. గ్రామం అంతా శోకసంద్రంలో మునిగిపోయింది. ఒకే గ్రామంలో ఒకే ప్రాంతంలో నలుగురు మృతితో తీరప్రాంతం అంతా మూగబోయినట్లయ్యింది.



గురుజు మురళి (ఫైల్)



ఈవన సూర్యనారాయణ (ఫైల్)



తిరుమల నరశింహమూర్తి (ఫైల్)



కడియం దినేష్ నాయుడు (ఫైల్)

నారాయణ స్కూల్లో దారుణం

- తరగతి గదిలో హార్పిక్ పౌడర్ తినేసిన ఎల్‌కేజీ చిన్నారి
- విజయవాడలో నాలుగు రోజులుగా అందిస్తున్న చికిత్స

పాలకొల్లు సెంట్రల్: తరగతి గదిలో ఓ చిన్నారి హార్పిక్ యాసిడ్ పౌడర్ తినేయడంతో ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటన పాలకొల్లు శంభన్న అగ్రహారం ప్రాంతంలో చోటుచేసుకుంది. పట్టణంలోని స్థానిక బుధవారపు వీధి ప్రాంతానికి చెందిన మామిడిపల్లి సంయుక్త, అనుదీప్ వివరాలను విలేకరులకు వెల్లడించారు. తమ కుమార్తె నాలుగేళ్ల చిన్నారి హార్వి సహస్ర పట్టణంలోని నారాయణ స్కూల్లో ఎల్‌కేజీ చదువుతోందని తెలిపారు. గత గురువారం స్కూల్‌కు వెళుతుండగా పాప బ్యాగ్‌లో బిస్కెట్ ప్యాకెట్ వేసి పంపించామని చెప్పారు. మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో చిన్నారికి అస్వస్థతగా ఉందని ఆసుపత్రికి తీసుకు వెళుతున్నామని స్కూల్ నుంచి ఫోన్ రావడంతో వెళ్లినట్టు చెప్పారు. అక్కడ చికిత్స చేసిన వైద్యులు ఇక్కడ కష్టమని, మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తరలించాలని సూచించారన్నారు. వెంటనే విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నట్లు చెప్పారు. అసలు విషయంపై ఆరా తీయగా స్కూల్లో ఇచ్చిన స్నాక్స్ బ్రేక్‌లో చిన్నారి బిస్కెట్ ప్యాకెట్ అనుకొని హార్పిక్ యాసిడ్ పౌడర్ తినేసిందని, దీంతో నోటి నుంచి రక్తం వచ్చినట్లు తెలిసిందన్నారు. చిన్నారి నాలుక, పేగులు, గొంతు లోపల భాగంలో కాలిపోయాయని వైద్యులు చెప్పినట్టు బాలిక తల్లి సంయుక్త కన్నీరుమున్నీరవుతూ వివరించారు. ప్రస్తుతం శరీరంలోకి పైపు ద్వారా ఓఆర్ఎస్ ద్రావణం, కొబ్బరి నీళ్లు, మంచినీళ్లు ఐదేసి చుక్కలుగా వేస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు సుమారు రూ.1.50 లక్షలు ఖర్చు అయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడలో కేసు నమోదు చేయించినట్టు కుటుంబసభ్యులు తెలిపారు.

తప్పించుకునే ప్రయత్నంలో బుకాయింపు

ఈ ఘటనపై స్కూల్ యాజమాన్యాన్ని ప్రశ్నించగా మీ పాప ఆ ప్యాకెట్ తెచ్చుకుందని బుకాయిసున్నారని చిన్నారి తల్లిదండ్రులు వాపోయారు. సీసీ ఫుటేజీ తీయాలని అడుగుతుంటే కెమెరాలు పనిచేయడం లేదని చెబుతూ ఎదురు వాదనకు దిగారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్కూల్ ప్రిన్సిపాల్ వెంకటేష్ మాట్లాడుతూ స్నాక్స్ సమయంలో పాపకు ఇబ్బంది ఏర్పడినట్టు తెలియగానే నోరు కడిగి ఆస్పత్రికి తరలించామని, ఈ ప్యాకెట్ ఎక్కడిది అని పాపని అడిగితే ఇంటి నుంచి తెచ్చుకున్నానని చెప్పిందని సమాధానమిచ్చారు. సుమారు నెల రోజుల క్రితం ఇదే పాఠశాలలో ఓ చిన్నారిపై టీచర్ అగ్గిపుల్ల అంటించి వాత పెట్టిన ఘటన చోటుచేసుకోవడం గమనార్హం.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సహస్ర, గొంతులో కాలిన ఎండోస్కోప్ చిత్రాలు



హార్వి సహస్ర (ఫైల్)



చిన్నారి సహస్ర తిన్న హార్పిక్ యాసిడ్ పౌడర్

మధ్యాహ్న భోజనం తిని విద్యార్థులకు అస్వస్థత

కుక్కునూరు: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం తిని 8 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. 6వ తరగతికి చెందిన 8 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తిన్న తరువాత వాంతులు అవ్వడంతో వెంటనే ఉపాధ్యాయులు స్థానిక పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. దీనిపై పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ సుప్రియను వివరణ కోరగా విద్యార్థుల ఆరోగ్యం బాగానే ఉందని, చికిత్స అందించిన వెంటనే పంపించివేశామని చెప్పారు. కాగా దీనిపై విద్యార్థుల తల్లితండ్రులు పాఠశాలకు చేరుకుని ఉపాధ్యాయులను నిలదీశారు. భోజనం తిన్న వెంటనే వాంతులు అయ్యాయని విద్యార్థులు చెబుతుంటే, బయట నుంచి తెచ్చుకున్న బిస్కెట్లు తినడం వలనే విద్యార్థులకు వాంతులు అయ్యాయని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఎంపీపీ చేబ్రోలు గీతావాణి, సర్పంచ్ రావు మీనాతో కలిసి పాఠశాలకు వెళ్లి విద్యార్థులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఉపాధ్యాయులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల భోజనంలో నాణ్యత పాటించాలని సూచించారు.



కుక్కునూరు పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

కుమ్మరిగట్టులో 9 డయేరియా కేసులు

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం సమీపంలో ఉన్న కుమ్మరిగట్టు గ్రామంలో సుమారు 9 మంది వాంతులు, విరోచనాలతో బాధపడుతుండగా మరొక ఐదుగురు జ్వరాల బారిన పడ్డారు. దీంతో నందాపురం పీహెచ్‌సీకి సంబంధించిన వైద్యులు డాక్టర్ సల్మాన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి బాధితులకు వైద్యసేవలు అందించారు. రోగుల్లో యండమూరి వెంకటలక్ష్మితో పాటు మీనాక్షి అనే చిన్నారిని చికిత్స నిమిత్తం జంగారెడ్డిగూడెం తరలించారు. ఈ వైద్యశిబిరాన్ని డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ అమృతం సందర్శించి గ్రామంలో డయేరియా కేసుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ వైద్య శిబిరాన్ని మరో ఐదు రోజులపాటు కొనసాగించాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌ఓ హరేంద్రకృష్ణ, డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ జె. సురేష్, సర్పంచ్ ఎం.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు అస్వస్థతకు గురి కావడానికి కలుషిత నీరు కారణమా? లేక మరేదైనా ఉందా? అని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు.



కుమ్మరిగట్టు వద్ద పరిసరాలను పరిశీలిస్తున్న డీఎం అండ్ హెచ్‌ఓ, డీఎస్‌ఓ, వైద్యాధికారులు

తండ్రికి తలకొరివి పెట్టిన తనయ

పాలకొల్లు సెంట్రల్: తండ్రికి కుమార్తె తలకొరివిపెట్టిన ఘటన పాలకొల్లులో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం పట్టణంలోని బ్రాడీపేట మూడవ వీధికి చెందిన సారిక సత్యనారాయణ (80) గత రెండేళ్లుగా అనారోగ్యంతో మంచానికే పరిమితం కాగా సోమవారం మృతి చెందారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. ఉండి నియోజకవర్గం కాళ్ల గ్రామంలో ఉంటున్న కుమార్తె తండ్రి సత్యనారాయణ అంతిమ సంస్కారాలు నిర్వహించింది. పెన్షన్‌తోనే జీవనం సాగించే సత్యనారాయణకు సచివాలయ సిబ్బంది ఉదయం సుమారు 8 గంటల సమయంలో పింఛన్ ఇవ్వడానికి వెళ్లగా అప్పటికే మృతి చెందాడు. సర్వర్ పనిచేయకపోవడంతో పింఛన్ పంపిణీ ఆలస్యమైందని చెబుతున్నారు.



తండ్రికి అంతిమ సంస్కారాలు నిర్వహిస్తున్న కుమార్తె

క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం



ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు సంఘ నాయకులు

తణుకు అర్బన్: శ్రీవిశ్వకర్మ వడ్రంగి పనివార్ల సంక్షేమ సంఘ సమావేశంలో భాగంగా సంఘ సలహాదారులు మట్టా వెంకట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు సంఘ అధ్యక్షుడు కలగర్ల శేషగిరిబాబు తెలిపారు. ఈ శిబిరంలో విజయ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ గుత్తుల బాల సుబ్రహ్మణ్యం, ఆదిత్య స్మైల్స్ డాక్టర్ వడలి అయ్యప్ప, వి.నరేష్, సన్ ఫార్మా సురేంద్ర సహకారంతో కంటి, దంత, మోకాళ్ల నొప్పులు, బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందచేసినట్లు వివరించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు వెంపటాపు శ్రీమన్నారాయణ, గోడి నాగబాబు, కార్యదర్శి కొప్పోజు కొండబాబు, కోశాధికారి కోటపాడు కోటేశ్వర రావు, సభ్యులు పాల్గొన్నారు.

కవి వీఎస్‌వీ ప్రసాద్‌కు తెలుగుతేజం పురస్కారం



నరసరావుపేటలో తెలుగుతేజం కవితా పురస్కారం అందుకున్న కవి వీఎస్‌వీ ప్రసాద్

తణుకు అర్బన్: తణుకు పట్టణానికి చెందిన కవి, పశ్చిమ గోదావరి జిల్లా అభ్యుదయ రచయిత సంఘం మాజీ అధ్యక్షుడు వీఎస్‌వీ ప్రసాద్‌కు శ్రీశ్రీ కళావేదిక తెలుగుతేజం పురస్కా రాన్ని ప్రధానం చేసింది. ఆదివారం పల్నాడు జిల్లాలోని నరసరావుపేటలోని భువనచంద్ర టౌన్‌హాల్‌లో నిర్వహించిన సభలో తెలుగు భాషా దినోత్సవ వేడుకల్లో భాగంగా శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కత్తిమండ ప్రతాప్‌కుమార్, జాతీయ అధ్యక్షురాలు జి.ఈశ్వరి తదితరుల చేతులమీదుగా తెలుగుతేజం తెలుగు భాషా సేవా పురస్కారం అందుకున్నట్లు కవి ప్రసాద్ తెలిపారు. గత 55 సంవత్సరాలుగా తెలుగు భాషా పరిరక్షణకై కవితల రూపంలో చేసిన కృషికి ఈ పురస్కారం దక్కినట్లుగా ప్రసాద్ వివరించారు.

ఆర్టీసీ సూపర్‌వైజర్‌కు ఉద్యోగ విరమణ సత్కారం



విజయకుమార్‌కు ఉద్యోగ విరమణ సత్కారం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీఎస్ ఆర్టీసీ తాడేపల్లిగూడెం డిపోలో గత 39 సంవత్సరాలుగా కండక్టర్‌గాను, కస్టమర్ రిలేషన్ కోఆర్డినేటర్‌గాను, ప్రస్తుతం సూపర్‌వైజర్‌గా తాడేపల్లిగూడెం డిపోలో పనిచేసిన దొంతల విజయ కుమార్ ఉద్యోగ విరమణ సన్మాన, సత్కార సభ స్థానిక డిపో నందు ఘనంగా నిర్వహించారు. నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆలపాటి సూర్యచంద్రరావు, తూర్పుగోదావరి జిల్లా ప్రజా రవాణా అధికారి వై.సత్యనారాయణ మూర్తి, డిపో మేనేజర్ సప్ప గిరిధర కుమార్, విశ్రాంత న్యాయమూర్తి బొమ్మిడి అప్పారావు, మానవత రాష్ట్ర డైరెక్టర్ సాగిరాజు జానకి రామరాజు, చేబ్రోలు కోపరేటివ్ బ్యాంక్ చైర్మన్ కడియాల రవి శంకర్, గ్రామ సర్పంచ్ రాందే లక్ష్మి సునీత తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ మాజీ కౌన్సిలర్ మృతి

తాడేపల్లిగూడెం (టీఓసీ): మున్సిపల్ మాజీ కౌన్సిలర్ పూడి సుబ్బారావు (94) ఆదివారం రాత్రి మృతి చెందారు. ఆయన సీపీఐ నుంచి రెండుసార్లు కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. సీపీఐ జిల్లా సమితి సోమవారం ఆయన మృతికి సంతాపం తెలిపింది.

స్పందనకు 4 ఫిర్యాదులు

ఆకివీడు: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు నాలుగు ఫిర్యాదులు అందినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ మార్కండేయేశ్వరరావు సోమవారం చెప్పారు. స్థానిక చినకాపవరం డ్రెయిన్ గట్టుపై ఆక్రమణల షెడ్లు, వాటికి అక్రమంగా ఇచ్చిన కరెంటు కనెక్షన్లు తొలగించలేదని మోరా రామిరెడ్డి ఫిర్యాదు చేశారన్నారు. ఎంఈఈ శాఖ ఆధ్వర్యంలో స్థానికంగా తనిఖీలు ఎన్ని చేయాలి, చేస్తున్నారు, లేబర్ యాక్టు ఎంత మందికి అమలు అవుతుందని వివరాలు తెలియజేయాలని మరో ఫిర్యాదు చేశారన్నారు. మండలంలో పలు చోట్ల ప్రమాదభరితంగా వాహనాలు నడుపుతున్నారని, వాహనంపై ముగ్గురు, నలుగురు కూర్చుని వేగంగా నడుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని రామిరెడ్డి ఫిర్యాదు చేశారన్నారు. చెరుకుమిల్లి గ్రామంలో సరిహద్దు రైతు చెరువు తవ్విన మట్టిన తన పొలంలో వేస్తున్నారని, ఆక్రమించుకోవాలని చూస్తున్నారని రైతు పెరుమాళ్ల తిరుపతమ్మ ఫిర్యాదు చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.

తణుకులో పందుల స్వైరవిహారం



తణుకు నారాయణ స్కూలు వెనుక ప్రాంతంలో రోడ్డెక్కుతున్న పందులు



తణుకు బ్యాంక్ కాలనీలో తిష్టవేసిన పందులు



తణుకు సొసైటీ రోడ్డులో పందుల సంచారం

- ఏ రోడ్డులో చూసినా హల్‌చల్ చేస్తున్న పందులు
- భయపడుతున్న ప్రజానీకం
- ఒక పక్క జ్వరాలు.. మరొక పక్క పందులు
- గతంలో లేని పందులు నేడు ఎలా వచ్చాయంటున్న ప్రజానీకం

తణుకు అర్బన్ : పారిశ్రామికంగా, వ్యాపార, వాణిజ్యపరంగా అభివృద్ధి చెంది పచ్చని వాతావరణంగా తణుకు ప్రాంతం ప్రసిద్ధికెక్కింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోనే తణుకు ప్రాంతం ఎంతో సందరంగా ఉంటుందని, రిటైర్మెంట్ అనంతరం తణుకులో సెటిల్ అవ్వాలనే నానుడితో తణుకు ప్రాంతం పేరుగాంచింది. అయితే ఇదంతా గతం. నేడు అధ్వాన్నపు పారిశుద్ధ్యంతో తణుకు ప్రాంతం కునారిల్లుతోంది. ఏ వీధిలో చూసినా చెత్తాచెదారాలతో దర్శనమిస్తున్న తణుకు మునిసిపాలిటీకి తాజాగా పందుల సమస్య తోడయ్యింది. 34 వార్డుల్లోను పందులు సంచరించడంతో తీవ్ర దుర్గంధపూరితమైన వాతావరణాన్ని ప్రజానీకం చూడాల్సివస్తుంది. రోడ్లపై ఉన్న చెత్తకుప్పలవద్ద పందులు స్వైరవిహారం చేస్తూ సృష్టిస్తున్న దుర్గంధానికి స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా బ్యాంక్ కాలనీ, సొసైటీ రోడ్డు, నారాయణ స్కూలు ప్రాంతాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉందని చెబుతున్నారు. బడి, గుడి లేకుండా చెత్త కుప్పలు, ఆ చెత్తకుప్పల చుట్టూ పందుల స్వైరవిహారాలు తప్ప తణుకును ఉద్ధరించిందేముందంటూ ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు.

గతంలో కంపోస్టు యార్డుకే పరిమితం

గత ఐదేళ్లు కనిపించని పందులు ఇప్పుడు ఎందుకు.. ఎలా వచ్చాయంటూ ప్రజానీకం ముక్కున వేలేసుకుంటున్నారు. పందుల కారణంగా మెదడు వాపు, స్వైన్‌ఫ్లూ వంటి వ్యాధులు మానవాళికి వచ్చే అవకాశాలు ఉన్నాయనే ఉద్దేశ్యంతో గతంలో పందులను ఊరికి దూరంగా తరలించారు. ఊరి చివర కంపోస్టు యార్డు ప్రాంతానికి పరిమితమైన పందులు నేడు వీధుల్లో కలియతిరుగుతున్నాయని ప్రజానీకం భయపడుతున్నారు. గత ఐదేళ్లపాటు పందుల పెంపకందారులను తీవ్రంగా హెచ్చరించి ఊరి చివర ఉన్న కంపోస్టు యార్డుకు పందులను తరలించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అడపాదడపా బయటకు వచ్చి హల్‌చల్ చేసిన పందులు కొన్ని రోజులుగా పూర్తిస్థాయిలో రోడ్లపైకి రావడంతో ఏ రకమైన జబ్బులు వస్తాయోనని ప్రజలు భయపడుతున్నారు.

పట్టించుకోని శానిటరీ అధికారులు

తణుకు మునిసిపాలిటీ పరిధిలో పందులు వీరవిహారం చేస్తూ దుర్గంధాన్ని పంచుతున్నా శానిటరీ అధికారులకు మాత్రం చీమకుట్టినట్లు కూడా లేదని ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. పందుల కారణంగా ఏదైనా రాకూడని జబ్బులు వస్తే ఎవరు బాధ్యత వహిస్తారంటూ మండిపడుతున్నారు. గత ఐదేళ్లు చూపించిన పర్యవేక్షణ నేడు ఏమైపోయిందంటూ ప్రజలు విమర్శిస్తున్నారు. స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర అంటూ పాలకులు, అధికారులు గుర్తొచ్చినప్పుడు ఫొటోలకు ఫోజులిస్తున్నారే కానీ రోడ్లపైకి వచ్చి పారిశుధ్య సమస్యలతో తలెత్తుతున్న ఇబ్బందులను పట్టించుకోరా అంటూ ప్రజానీకం దుమ్మెత్తి పోస్తున్నారు. శానిటరీ అధికారులు మస్తర్ల లావాదేవీలపై చూపిస్తున్న శ్రద్ధ పారిశుద్ధ్యంపై పెట్టడంలేదంటూ ప్రజానీకం శాపనార్ధాలు పెడుతున్నారు.

పింఛన్ ఇచ్చి కుటుంబాన్ని ఆదుకోవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): అంగవైకల్యాలు, మానసిక ఇబ్బందులతోపాటు అనారోగ్య సమస్యతో తాను, తన కుమారుడు సాయి ఇబ్బందులు పడుతున్నామని తనకు, తన కుమారుడుకు దివ్యాంగుల ప్రభుత్వ పింఛన్ ఇచ్చి ఆదుకోవాలని పట్టణానికి చెందిన నారి భాగ్యలక్ష్మి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో మునిసిపల్ కమీషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. తనకు, తన కుమారుడుకు సదరం సర్టిఫికెట్స్ ఉన్నప్పటికి ఫలితంలేదని వాపోయారు. తమను ఆదుకోవాలని కోరారు. కమీషనర్ యేసుబాబు మాట్లాడుతూ పెన్షన్లు వచ్చేందుకు తన వంతుగా కృషి చేస్తానని చెప్పారు. అదేవిధంగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు మరో ఐదు ఫిర్యాదు లు రోడ్లు, డ్రెయినేలు నిర్మాణాలు చేపట్టాలని వినతులు వచ్చాయన్నారు. ఎంఈ వై.వెంకట రమణ, మేనేజర్ ఎం.రవి సుధాకర్, టీపీఓ వి.జగదేశ్వరరావు, ఎం.హెచ్.ఓ డాక్టర్ రాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సీహెచ్ దుర్గా భావానీ, కె.విశాలాక్షి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం: పట్టణ ప్రజలకు మంచినీటిని సరఫరా చేసే ప్రధాన నీటి సరఫరా కేంద్రంలో మరమ్మతుల నిమిత్తం మంగళవారం సాయంత్రం పట్టణంలో నీటి సరఫరాకు అంతరాయం కలుగునని కమిషనర్ ఎం.ఏసుబాబు తెలిపారు. 1వ వార్డు నుంచి 35వ వార్డు వరకు సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు నీటి సరఫరా ఉండదన్నారు. బుధవారం ఉదయం యథావిధిగా ఉదయం 6 గంటలనుంచి 7 గంటలవరకు మంచినీటి సరఫరా జరుగునని ప్రజలు సహకరించాలని కోరారు.

ప్రజల్ని మోసం చేయడంలో చంద్రబాబు దిట్ట

మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



కొమ్ముగూడెంలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాల అమలు తీరును ప్రజల్ని అడిగి తెలుసుకుంటున్న మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అమలు చేసిన పథకాలతో పాటు సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తామని నమ్మబలికి ప్రజల్ని మోసగించారని మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ దుయ్యబట్టారు. సోమవారం రాత్రి మండలంలోని కొమ్ముగూడెం గ్రామంలో బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎన్నికల నాటికి ఖజానాలో రూ.7500కోట్లను వివిధ పథకాలకు కేటాయించిందన్నారు. ఆ సొమ్ములను తదుపరి వచ్చిన కూటమి ప్రభుత్వం లబ్ధిదారులకు అందజేయలేదని విమర్శించారు. 87లక్షల మంది విద్యార్థులకు గాను 30లక్షల మంది విద్యార్థులకు తల్లికి వందనం ఎగ్గొట్టారన్నారు. జగన్ ప్రవేశపెట్టిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేస్తామని చెప్పి కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత అదే యాక్ట్‌ను అమలు చేస్తున్నారని విమర్శించారు. ఆరోగ్యశ్రీ పథకానికి చెల్లించాల్సిన రూ.4వేల కోట్లను చెల్లించకుండా ఆపేశారన్నారు. పేదలకు వైద్యం అందకుండా చేసిన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లకు వారి ఉసురు తగలక తప్పదన్నారు. ఇంటింటికి రేషన్ వాహనాలను నిలిపివేసి, సంబరాలు చేసుకున్నారన్నారు. ఆడబిడ్డ పథకం కింద 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1500లు చొప్పున జమ చేస్తామని నమ్మబలికారన్నారు. ఏడాది గడుస్తున్నా ఈ పథకం అమలుకు నోచుకోలేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, ప్రస్తుత కూటమి ప్రభుత్వం పథకాలను ప్రజలు బేరీజు వేసుకోవాలన్నారు. వైస్ ఎంపీపీ సూర్పని రామకృష్ణ, ఎమ్పీటీసీ మట్టా సత్యనారాయణ, జిల్లా స్పోక్స్‌పర్సన్ ముప్పిడి సంపత్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జద్దు హరిబాబు, నాయకులు కర్రి భాస్కరరావు, కొలుకులూరి ధర్మరాజు, వెలిశెట్టి నరేంద్రకుమార్, గంటి చిన సర్వేశ్వరరావు, బొద్దాని శ్రీనివాస్, పోలిమోను శ్రీనివాస్, ములకాల రాంబాబు, తాడేపల్లి మోషే, కనుపూరి ఉదయభాస్కర్, యాతం బూరయ్య, చీకట్ల మల్లేశ్వరరావు, కల్లేపల్లి కృష్ణంరాజు, కాసాని వెంకటేశ్వర్లు, చిగురుపాటి మహేష్, చిటకన మంగ, సూర్పని గోపీ, సూర్పని ఆదినారాయణ, గోపిశెట్టి దొరబాబు, ప్రత్తి రాజాబాబు, సిర్రాపు శాంతకుమార్ పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వేల్పూరులో సమావేశంలో మాట్లాడుతున్న వీరభద్రరావు

తణుకు అర్బన్: కూటమి నేతలు ఎన్నికల మ్యానిఫెస్టోలో భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని వేల్పూరు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు బళ్ల చిన వీరభద్రరావు డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ అనుబంధం) సమావేశం తణుకు మండలం వేల్పూరు గ్రామంలోని పార్వతి దేవి ఆలయ ప్రాంగణంలో ఉపాధ్యక్షుడు దున్నే రుద్ర నాగేశ్వరరావు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన బోర్డు ద్వారా కార్మికుల కుమార్తెలు, మహిళా కార్మికులకు వివాహకానుకతో పాటు ప్రసూతి సందర్భంగా బోర్డు నుంచి పారితోషకం అందించేవారని అన్నారు. పని ప్రదేశంలో ప్రమాదవ శాత్తు మరణించిన, సహజ మరణంపాలైన భవన నిర్మాణ కార్మిక కుటుంబాలను ఆదుకునేందుకు నష్టపరిహారం అందించే వారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీరవల్లి వెంకన్న, వాటాల నాగేశ్వరరావు. పిల్లి పరమేశ్వరరావు. కరేళ్ల అర్జున్. ఆనందం గంగాధర్. సోర పల్లి రామకృష్ణ, షేక్ ఇస్మాయిల్, విప్పర్తి రవీంద్ర, వీరా త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.2 లక్షల విరాళం



దాత కృష్ణకుమారిని సత్కరిస్తున్న ఆలయ ఈఓ

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి నిత్యాన్నదాన కార్యక్రమానికి పట్టణానికి చెందిన దాత రేపాక కృష్ణకుమారి రూ.2 లక్షల చెక్కును విరాళంగా సోమవారం ఆలయ కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాసరావుకు అందజేశారు. దాతను శాలువతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని అందజేసినట్టు ఈఓ శ్రీనివాసరావు తెలిపారు. ఇప్పటి వరకు నిత్యాన్నదానానికి రూ.35 లక్షలు సమకూరిందని, మరో రూ.15 లక్షలు సమకూరిస్తే రూ.50 లక్షలు అవుతుందని చెప్పారు. నిత్యాన్నదానం ప్రారంభించడానికి అవకాశం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ పసుపులేటి వాసు, అర్చకులు కిష్టప్ప, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లను సద్వినియోగం చేసుకోవాలి



దుంపగడప గ్రామంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

ఆకివీడు: పింఛన్ల సొమ్ము రూ. 15 వేలు ప్రతి నెలా వచ్చేదని ప్రస్తుతం నిలిపివేశారని ఇద్దరు దివ్యాంగులు, ముగ్గురు వృద్ధులు, ఒక వితంతువు జాయింట్ కలెక్టర్ జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి వద్ద వాపోయారు. మండలంలోని దుంపగడప గ్రామంలో సోమవారం పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వృద్ధులు, దివ్యాంగులు, వితంతువుల పింఛన్లు ఎందుకు నిలుపుదల చేశారని ఆయన గ్రామ కార్యదర్శిని ప్రశ్నించారు. అర్హులకు పింఛన్లు నిలుపుదల చేయవద్దని హెచ్చరించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో గౌరవంగా బ్రతకాలనే ఉద్దేశ్యంతో పింఛన్లును ప్రభుత్వం పంపిణీ చేస్తుందని చెప్పారు. పింఛన్ సొమ్మును దుబరా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఒకటవ తేదీన పింఛన్లు ఇంటివద్దకు వచ్చి ఉద్యోగులు అందజేస్తున్నారా లేదా అని పలువుర్ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్.వెంకటేశ్వరరావు, ఆర్ఐ వంటపాటి ఆంజనేయులు, సర్పంచ్ ముద్దే విశ్వేశ్వరరావు, ఎంపీడీఓ మార్కండేయేశ్వరరావు, కార్యదర్శి, వీఆర్వో పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం

యలమంచిలి: నారినమెరక పంచాయతీ గవళ్లపేటలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశా ల ప్రధానోపాధ్యాయుడు శాంత రాజు ఉపాధ్యాయ విరమణ చేసిన సందర్భంగా ఆదివారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి శాంతరాజు పనితీరును అభినందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు ఇసుకపల్లి శ్రీధర్‌వర్మ, ఉప సర్పంచ్ శేఖర్ బాబు, ఎంఈఓ వాణి, రిటైర్డ్ తెలుగు టీచర్ బుంగా జెస్సీకళ, జై భీమ్ యువసేన ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు గెడ్డం సునీల్ గవాస్కర్, వలవల విష్ణు బాలాజీ, యూటీఎఫ్ నాయకులు పోలిశెట్టి క్రాంతికిరణ్, గుత్తిందీవి శ్రీనివాసరావు, సంఘ అధ్యక్షులు సంసోన్, వెంకటరమణ, పౌలు, మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతోనే సంపూర్ణ ఆరోగ్యం

భీమవరం: న్యూ ఆంధ్ర బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 21వ తేదీన మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి షేక్ ఖాసీం చెప్పారు. సోమవారం పోటీలకు సంబంధించిన బ్రోచర్స్‌ను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అద్నాన్ నయీమ్ అస్మి మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో ఆరోగ్య పరిరక్షణ ప్రధానమని, బాడీ బిల్డింగ్ క్రీడ ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. యువత క్రమశిక్షణతో క్రీడల పట్ల శ్రద్ధ కనబర్చడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందన్నారు.

రైతు సేవలకు గ్రహణం

- వెలవెలబోతున్న ఆర్ఎస్‌కేలు
- మూలకు చేరిన కియోస్క్ యంత్రాలు
- అరకొరగా ఎరువులు, పురుగుల మందుల పంపిణీ
- అవస్థలు పడుతున్న అన్నదాతలు



ఇరగవరం మండలం గోటేరులోని రైతు సేవాకేంద్రం



కె ఇల్లిందలపర్రు మూలకు చేరిన కియోస్క్ యంత్రం

ఇరగవరం: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఎరువులు, పురుగు, మందులు, వ్యవసాయ పరికరాలు, అనుబంధ రంగ వస్తువులు రాయితీపై అందజేయడంతో పాటు సాగుకు సంబంధించి సూచనలు, సలహాలు అందించేవారు. ప్రతి ఆర్‌బీకేలో కియోస్క్ యంత్రాలు ఏర్పాటు చేయడంతో రైతులే నేరుగా ఎరువులు, పురుగు మందులకు ఇండెంట్ పెట్టుకొనేవారు. ప్రతి రోజూ రైతుల రాకపోకలతో రైతుభరోసా కేంద్రాలు కళకళలాడేవి. తణుకు నియోజకవర్గంలో ఇరగవరం మండలంలో 19, అత్తిలి మండలంలో 19, తణుకు మండలంలో 12 రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చారు. కానీ రైతులకు ఎటువంటి సేవలు అందించకపోవడంతో ఆయా కార్యాలయాలు వెలవెలబోతున్నాయి. కొన్ని నెలలుగా రైతు సేవా కేంద్రాల్లో డిజిటల్ కియోస్క్ యంత్రాలు నిరుపయోగంగా మారాయి. దీంతో రైతుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కియోస్క్ యంత్రాలు ఆండ్రాయిడ్ సాంకేతిక పరిజ్ఞానంతో నడుస్తాయి. ఎరువులు, పురుగు మందుల, ఇతర వస్తువులు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకొనే సౌకర్యంతో పాటు పంట యాజమాన్య పద్ధతులపై సమాచారాన్ని వీడియో రూపంలో పొందవచ్చు. వాతావరణ సూచనలు, ఏ సమయంలో ఏ పంట చేయాలన్న సమగ్ర సమాచారాన్ని ఇందులో పొందుపరిచి రైతులకు తెలియజేసేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రైతు సేవా కేంద్రాల్లో కియోస్క్ యంత్రాలు నిరుపయోగంగా మారాయి. కనీసం ఎరువులు బుక్ చేసుకొనేందుకు కూడా వినియోగించకపోవడంతో లక్షల రూపాయల ప్రజాధనం వృథా అవుతోంది. ఎరువులు సక్రమంగా రాకపోవడంతో తప్పనసరి పరిస్థితుల్లో రైతులు ప్రైవేట్ డీలర్ల వద్ద అధిక ధరలకు ఎరువులు కొనుగోలు చేస్తున్నారు. అందువలన పాలకులు, అధికారులు స్పందించి రైతు సేవా కేంద్రాలద్వారా రైతులకు ఎరువులు, పురుగు మందులు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఎరువులైనా అందించాలి



రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువులైనా పూర్తిస్థాయిలో రైతులకు అందించాలి. ఈ ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు అందించలేదు. దీంతో ప్రైవేట్ డీలర్ల వద్ద కొనుగోలు చేస్తున్నాం. గతంలో ఆర్‌బీకేలు బాగా పనిచేసేవి. ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదు.

– కోపూర్రి శ్రీనివాస్‌రెడ్డి, ఏలేటిపాడు , ఇరగవరం మండలం.

వినియోగంలోకి తీసుకురావాలి



గతంలో రైతు భరోసా కేంద్రాల్లో డిజిటల్ విధానంలో కియోస్క్ యంత్రాల ద్వారా అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల అందించేవారు. వ్యవసాయ యంత్రాలు, పంటల ఉత్పత్తి, మార్కెట్ వివరాలు వంటి సమాచారం తెలియజేసేవారు. అలాగే ఇప్పుడు కూడా కియోస్క్ యంత్రాలను వినియోగంలోకి తీసుకురావాలి.

– మంగిన రామా నాయుడు, ఇరగవరం ఎంపీటీసీ, రైతు.